



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 26 జనవరి 2026 పేజీలు 8







## రిజిస్ట్రేషన్ కార్యాలయమా..

# దోపిడీ దర్బార్ రా..

- తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'సిస్టమాటిక్ లంచాల దందా' ఆరోపణలు...
- ఇంటిపన్ను రసీదు పేరిట రూ.10,000 వసూలు, రికార్డుల మార్పిడికీ అధికారిక మౌన సమ్మతి..?
- బాధితుల వాంగ్మూలాలు, అంతర్గత సమాచారం ఆధారంగా ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్...
- ప్రజల పన్నులతో జీతాలు,ప్రజలనే పీల్చే పద్ధతి..!
- "ఇక్కడ పని కావాలంటే చట్టం కాదు, లంచమే నిబంధన"....బాధితుల ఆవేదన

విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు కొద్దిమంది అధికారుల చేతుల్లో లాభాల యంత్రాలుగా మారుతున్నాయా..? చట్టం, నిబంధనలు, ప్రభుత్వ ముద్రల వెనక దాగి సామాన్య ప్రజల నుంచి డబ్బులు పిండే వ్యవస్థ కొనసాగుతోందా..? ఈ ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తున్నాయి, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వరుసగా వెలుగుచూస్తున్న తీవ్రమైన అవినీతి ఆరోపణలు, ఇది ఒక ఒంటరి ఘటన కాదని, ప్లాన్ చేసి అమలు చేస్తున్న సిస్టమాటిక్ దందా అని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ చట్టం పనిచేయదు, 'కొర్రీ' పనిచేస్తుంది..! ఏదో ఒక లోపం చూపించి డబ్బు వసూలే పద్ధతి...? బాధితుల కథనం ప్రకారం, తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోపం ఏదో ఒక సాంకేతిక కారణం ఏదో ఒక నిబంధన చూపించి ఫైల్‌ను ఆపేస్తున్నారట, డబ్బు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.


వివరాలు 8 లో




# ఓటు విలువైన ఆయుధం

### దేశ భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** ఓటు చాలా విలువైన ఆయుధమని, దేశ భవిష్యత్తు బాగుండాలంటే ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఉదయం నగరంలోని లక్ష్మీ టాకీస్ కూడలి నుండి జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా మరల లక్ష్మీ టాకీస్ కు చేరుకునే విధంగా తొలుత


2


# రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతాం



- యువతకు స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- వచ్చే ఏడాది నాటికి బందరు పోర్టు పూర్తి చేస్తాం
- కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఒత్తిడి నుండి విజయం వైపు' కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థులకు ఒత్తిడి లేని చదువులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని గోల్డ్ కన్వెన్షన్లో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒత్తిడి నుండి విజయం వైపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఒత్తిడిని జయించడం, ఉత్తీర్ణత సాధించడంతో పాటుగా


మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)



## రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతాం

మెరుగైన ఫలితాలు సాధించడం, పదో తరగతి తర్వాత ఉన్న ఉన్నత విద్య అవకాశాల గురించి నిపుణులతో శిక్షణ ఇచ్చారు. అవసరమైన మెటీరియల్ కూడా అందించారు.రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి.విద్య వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు.విద్య వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచడంతో పాటుగా.. మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం ప్రవేశపెట్టాం. పేరెంట్ టీచర్ మీటింగ్స్ ద్వారా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం, వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం చేశాం.మన రాష్ట్రంలోని మానవ వనరుల్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేలా స్కిల్ డెవలప్మెంట్ కోసం సన్నాహాలు చేపట్టాం. దేశ విదేశాల్లో పర్యటించి ఏపీకి పెట్టుబడులు తీసుకొస్తున్నారు. ఎక్కడెక్కడకు వెళ్లి చదువుకున్నా.. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం తిరిగి స్వస్థలాలకు వచ్చే విధంగా సన్నాహాలు చేస్తున్నాం.వచ్చే ఏడాదికి బందరు పోర్టును పూర్తి చేయడం ద్వారా మన బందరు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేయబోతున్నాం. మరిన్ని కంపెనీలను కూడా బందరులో ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నాను.ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. ఆ దిశగా యువతకు అవకావాలు కల్పిస్తున్నాం. విద్యార్థి దశ నుండే పారిశ్రామిక రంగంలో స్థిరపడేందుకు ఉన్న అవకాశాలను శోధించాలని మంత్రి కొల్లు రవీంద్ర విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## చెత్త నుంచీ సంపద తయారీపై ముగిసిన శిక్షణా తరగతులు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లో ఇంటింటి నుంచీ చెత్త సేకరణ, చెత్త నుంచీ సంపద తయారీలో పనితీరు మెరుగుపరుచుకునేందుకు చల్లపల్లి సుప్రిం ఎల్టిసి ట్రైనింగ్ సెంటరులో మూడు రోజులపాటు జరిగిన శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఆరుగంటలకే డిప్యూటీ ఎంపీడీవోలు, కార్యదర్శులు చల్లపల్లిలో వార్డుల్లో తిరిగి చల్లపల్లి గ్రామం లో ఇంటింటి నుంచీ జరుగుతున్న చెత్త సేకరణను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ఇంటికి తిరిగి చెత బిసేకరించటం, చెత్త విభజించటాన్ని చూసి వారు సైతం ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. మచిలీపట్నం డీఎల్పీవో ఎండి.రజావుల్లా ఉదయాన్నే చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొని కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం సంపద తయారీకేంద్రం వద్ద శిక్షణా కార్యక్రమం, గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య చర్యలపై తగు ఆదేశాలను, సూచనలు అందచేశారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందచేశారు. అందరితో కలిసి గ్రూపు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఎం పీడీవో ఆనందకుమారి, డిప్యూటీ ఎంపీడీవో బాలాజీ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, రిసోర్స్ పర్సన్లు పార్థసారధి, ఏడుకొండలు, రామకృష్ణ, వి.బి.లక్ష్మిలు పాల్గొన్నారు. చెత్త సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ(ఐవీఆర్ఎస్)లో 50శాతం కంటె తక్కువగా ఉన్న 12 మండలాలకు చెందిన పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, 27 మంది కార్యదర్శులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొత్తమాజేరులో పూర్వ విద్యార్థుల సందడి

**చల్లపల్లి మేజర్ న్యూస్:** మండల పరిధి లోని కొత్త మాజేరు లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 50ఏళ్ళ కాలంలో ఈ ప్రాంతంలో నివశించి ఇతర ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడినవారు, ఇక్కడ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు నకుటుంబ సమేతంగా ఒక్కచోట కలుసుకుని తమ ఆనందలను పంచుకున్నారు. కొత్తమాజేరులో గ్రామ పూర్వ నివాసిత, పూర్వ విద్యార్థుల ఆత్మీయ నమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరికొకకు ఆప్యాయంగా వలకరించుకుంటూ మైమరిచిపోయారు. వారి వారి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంటూ ఉమ్మడి కుటుంబంలా కలిసిపోయారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని వయస్సును, పెద్దరికాన్ని మరిచి చిన్నపిల్లల్లా కేరింతులు కొట్టారు. వారి హోదాలను పక్కనబెట్టి ఆరేయ్.... ఒరేయ్.. అని పిలుచుకుంటూ స్నేహ మాధుర్యాన్ని ఆస్వాదించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు. అమెరికా వంటి దూర దూరప్రాంతాల నుంచి 500మందికి పైగా హాజరైనట్లు సమ్మేళన నిర్వాహకులు కొత్త మాజేరు పూర్వ నివాసి, 1979-80 పూర్వ విద్యార్థి తలశిల చంద్రశేఖర్ అన్నారు. ఏడేళ్ళ నుంచి కృషిచేస్తే ఈనాటికి ఇలా కలుసుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. 2018లో కొత్తమాజేరు వాట్సప్ గ్రూపు ప్రారంభించామని, అప్పటి నుంచి సభ్యులను పెంచుకుంటూ వచ్చామని రెండేళ్ళ నుంచి గట్టిగా ప్రయత్నిస్తే ఈరోజు ఇలా అందరూ ఒక్కచోట కలుసుకున్నామని వివరించారు. ఒక్కచోట అందరం ఇలా కలసుకోవటం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తంచేశారు. చిన్న ప్పుడు ఊర్లో కలిపి ఉన్నవారు, కలిసి చదువుకున్నవారు అందరూ ఒకేసారి ఇక్కడకు రావటంతో కొత్తమాజేరులో పండగ వాతావరణంగా కనిపిస్తోంది కార్యక్రమ పర్యవేక్షకులు అగ్గిరాముడు ఆనందం వ్యక్తంచేశారు.

# రిజిస్ట్రేషన్ కార్యాలయమా.. దోపిడీ దర్బార్ రా..




(మొదటిపేజీ తరువాయి)

కదులుతుంది. అన్న మాట అక్కడ బహిరంగ రహస్యంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఇంటిపన్ను రసీదు పేరిట రూ.10 వేల లంచం ఇస్తేనే పని జరిగిందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇది ఒక్క కేసా, లేక రోజువారీ వసూళ్లా..? ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక ఘటనలో, ఆస్తి రిజిస్ట్రేషన్‌కు వచ్చిన బాధితులను "ఇంటిపన్ను రసీదు లేదు" అనే కారణంతో అడ్డుకుని, పని జరగాలంటే రూ.10 వేలు ఇవ్వాలని లేదంటే ఫైల్ పెండింగ్‌లోనే ఉంచుతామని బెదిరించినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇది ఒక్క కేసే కాదు, ఇలాంటి వసూళ్లు రోజువారీగా జరుగుతున్నాయన్న ఆరోపణలు బాధితుల వాంగ్మూలాలతో బలపడుతున్నాయి. వైట్నర్ పెయింట్, రికార్డుల తారుమారు ఎలా... ప్రభుత్వ పత్రాల నకిలీకి అధికారిక ప్రోత్సాహం..? ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళనకరమైన అంశం పాత ఇంటిపన్ను రసీదుపైనే వైట్నర్ రాసి కొత్త రసీదుగా చూపించాలంటూ బాధితులను బలవంతం చేసినట్లు వచ్చిన ఆరోపణలు. ఇది కేవలం లంచం కాదు, ఇది ప్రభుత్వ రికార్డుల నకిలీకి మార్గం చూపడమే. న్యాయ నిపుణుల మాటల్లో "ఇలాంటి చర్యలు ఐపిసి, అవినీతి నిరోధక చట్టాల కింద తీవ్రమైన నేరాలు." సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారి పైనే ఆరోపణలు శాఖ మొత్తం వ్యవస్థపై అనుమానాల నీడ సాధారణ ఉద్యోగులపై కాదు సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారిపై ఇలాంటి ఆరోపణలు రావడం రిజిస్ట్రేషన్ శాఖ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోంది. "ఆమె మామూలుది కాదు" అన్న మాట ఇప్పుడు కార్యాలయ పరిసరాల్లో వ్యంగ్యంగా మారిందని సమాచారం. లంచం తీసుకునే విధానం, మాటల తీరుపై బాధితులు, న్యాయవాదులు, డాక్యుమెంట్ రైటర్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది, నిజాయితీ అధికారులకూ శిక్షేనా.... ఒక్కరి అవినీతి, శాఖ మొత్తానికి మచ్చ ఈ పరిణామాలతో నిజాయితీగా పని చేస్తున్న అధికారులూ ఇబ్బంది పడుతున్నారు. ప్రజల దృష్టిలో "అందరూ ఒకటే" అన్న భావన బలపడుతోంది. ఇది వ్యవస్థను కబళించే అవినీతి క్యాన్సర్గా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏసీబీకి ఫిర్యాదు చేస్తే ఏమవుతుంది..? భయంతోనే మౌనం, ఇదే దందాకు బలం..? బాధితులు బయటకు రావడానికి భయపడుతున్నారు. "మళ్లీ అదే కార్యాలయానికి రావాల్సి ఉంటుంది" "ఫైళ్లు ఆపేస్తారు" "ఇంకా ఇబ్బందులు పెడతారు" అన్న భయమే ఈ దందాకు బలం అవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల మౌనం ఎందుకు..? విచారణ జరగకపోతే అనుమానాలు బలపడవా..? ఇంత తీవ్రమైన ఆరోపణలు ఉన్నా శాఖాధిపతుల స్పందన లేదు స్వతంత్ర విచారణ ప్రకటన లేదు, సస్పెన్షన్ చర్యలు లేవు ఇది ప్రజల్లో అనుమానాలకు దారితీస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇది ప్రమాదకర సంకేతం ఇప్పుడైనా చర్యలు లేకపోతే, 'రిజిస్టర్ శాఖకు మాయని మచ్చ' ఖాయం అని ప్రజాస్వామ్యంలో పాలనపై ప్రజల విశ్వాసం నిలబడాలంటే తక్షణ విచారణ బాధ్యులపై కఠిన చర్యలు, బాధితులకు రక్షణ అత్యవసరం. లేదంటే తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లంచాల అడ్డాగా, భయాల కేంద్రంగా, ప్రజలకు శాపంగా మిగిలిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఓటు విలువైన ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)



పెద్ద ఎత్తున సైకిల్ ర్యాలీ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించి స్వయంగా సైకిల్ తొక్కారు. అనంతరం జిల్లా కలెక్టర్ లక్ష్మి టాకీస్ కూడలి నుండి జడ్పీకన్వెన్షన్ హాల్ వరకు కాలినడగన నా భారతదేశం నా ఓటు అనే నినాదంతో పచ్చ జెండా ఊపి ర్యాలీనీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం 1950 సంవత్సరం జనవరి 25వ తేదీన ఆవిర్భవించిందని, అందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం అదే రోజున జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రజలందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే సైకిల్ ర్యాలీతో పాటు కాలినడకన ర్యాలీ నిర్వహించామన్నారు. జిల్లాలో అన్నిచోట్ల జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఎన్నికల సమయంలో అందరూ తప్పకుండా ఓటు వేయాలని జిల్లాలోని ఓటర్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఓటు చాలా విలువైన ఆయుధమని దాన్ని వినియోగించుకోకుండా ఉండరాదన్నారు. ఏ ప్రలోభాలకు గురికాకుండా సొంతంగా స్వేచ్ఛతో ఆలోచన చేసి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిస్తున్నానన్నారు. దేశ భవిష్యత్తు బాగుండాలంటే ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు మనది పటిష్టంగా ఉన్న ప్రజాస్వామ్యమని అందరం కలిసి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేద్దామన్నారు. మనకు 1947లో స్వాతంత్రం వచ్చాక చాలామంది దేశంలో ప్రజాస్వామ్యానికి మనుగడ లేదని విశ్లేషించారన్నారు. విదేశాల్లో ఉన్న రాజకీయ శాస్త్రవేత్తలు త్వరలో భారతదేశం లో ప్రజాస్వామ్యం కూలిపోతుందని చెప్పారన్నాన్నారు.అయితే ఆ రోజున భారత రాజ్యాంగం లో పొందుపరిచిన అంశాలు ఎన్నికల సంఘం ప్రతి సందర్భంలో ఎప్పటికప్పుడు తీసుకుంటున్న చర్యలు, నిర్ణయాల వలన 77 సంవత్సరాలుగా భారతదేశంలో ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉందన్నారు. భారత ఎన్నికల సంఘం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుపుతూ అధికారాన్ని సజావుగా బదలాయింపు జరగడానికి అనువైన వాతావరణాన్ని కల్పించిందన్నారు. ఇంతటి మెరుగైన ప్రజాస్వామ్యం మరింత మెరుగుపడాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పిల్లలు రాబోయే ఓటర్లని చాలామంది యువ ఓటర్లు మనకు ఉన్నారని వారు ఎక్కడ ఉన్న ఎన్నికల రోజున ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎక్కడ నివసిస్తూ ఉంటే అక్కడే ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్నికల అవార్డు స్వీకరించేందుకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. తదనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జిల్లాస్థాయి 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన, వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ. జిల్లాలో 15 లక్షల 44వేల 568 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 7 లక్షల 47వేల 659 మంది ఉండగా స్త్రీ ఓటర్లు 7 లక్షల 96 వేల 860 మంది ఉన్నారన్నారు. మరో 49 మంది ట్రాన్స్ జెండర్ లు ఉన్నారన్నారు. మన దేశంలో యువత ఎక్కువగా ఉందన్నారు. వారు తక్కువగా పేర్లను నమోదు చేసుకుంటున్నారన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. మన దేశంలో ఉన్న పారదర్శక ఎన్నికల విధానం మరే దేశంలోనూ లేదన్నారు. ప్రతినెల జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు సూచనలు తీసుకొని పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీర వెంకట గురుమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పునాది లాంటిదని, దేశానికి పునాది పటిష్టంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడగలుగుతుందన్నారు. ఓటు హక్కు భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా కల్పించిన వజ్రాయుధం అని, మంచి ప్రభుత్వాలు రావడానికి ఆలోచించి ఓటు వేయాలన్నారు.చాలామంది ఓటు వేయడానికి రాకుండా కొన్ని పనులు, వ్యాపారం, వ్యవసాయం ఉన్నాయంటూ ఒక గంట కూడా కేటాయించలేకపోతున్నారన్నారు.గతంలో ముఖ్య ఎన్నికల కమిషనర్ టిఎన్ స్టేషన్ ఉన్నప్పుడు ఎన్నికల నిర్వహణలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.తదుపరి వయోవృద్ధులైన ఓటర్లను శాలువలు, పూలమాలతో ఘనంగా అతిధులు సత్కరించారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన యువకులకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు.ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో విశేషంగా ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, మచిలీపట్నం ఆర్డిఓ పోతురాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, బీసీ సంక్షేమ అధికారి రమేష్, డీఈవో సుబ్బారావు, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి శంకర్నాథ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాజీ మున్సిపల్ చైర్మన్ సిలార్ దాదా, అబ్దుల్ మథీన్, కొడాలి శర్మ, పంతం వెంకట గజేంద్ర రావు, తదితర అధికారులు వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఎన్సిసి క్యాడేట్లు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### అత్యుత్తమ కెమెరాలలో ఒకటైన మోటరోలా సిగ్నేచర్తో

# భారత్‌లో ఫ్లాగ్‌షిప్ విభాగాన్ని ఉన్నతీకరిస్తున్న మోటరోలా




**విజయవాడ, జనవరి 25, మేజర్ న్యూస్ :** మొబైల్ టెక్నాలజీ, ఆవిష్కరణలలో ప్రపంచ అగ్రగామి, భారతదేశంలోని ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు భారతదేశంలో మోటరోలా సిగ్నేచర్ ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది అధునాతనత, విలాసవంతమైన వ్యక్తిత్వంతో అల్ట్రా-ప్రీమియం ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్‌లలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. రాజీపడని శ్రేష్ఠతను కోరుకునే వినియోగదారుల కోసం రూపొందించబడిన సిగ్నేచర్, ప్రపంచంలోనే మొట్టమొదటి కెమెరా ఆవిష్కరణ, రిఫైన్డ్ లగ్జరీ హస్తకళ, తదుపరి తరం పనితీరు, క్యూరేటెడ్ జీవన శైలి అధికారాలను కలపడం ద్వారా ఫ్లాగ్‌షిప్ అనుభవాలను పునర్నిర్వచించింది. ఈ ప్రీమియం పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, పోలార్ ఆధారిత మోటో వాచ్‌ను కూడా మోట రోలా ప్రవేశపెట్టింది. ఇది టైమ్‌లెస్ వాచ్ డిజైన్‌లో సెగ్మెంట్-లీడింగ్ వెల్‌నెస్ ట్రాకింగ్‌ను అందిస్తుంది. మోటరోలా సిగ్నేచర్‌లో ప్రపంచంలోనే ఏకైక ట్రిపుల్ సోనీ ఎల్ వైటిఐఏ™ ప్రో-గ్రేడ్ కెమెరా సిస్టమ్ ఉంది. ఇది వాస్తవ ప్రపంచ పరిస్థితులలో అసాధారణమైన ఫోటో, వీడియో పనితీరు కోసం డిఎక్స్ఓమార్క్ గోల్డ్ లేబుల్ సర్టిఫికేషన్‌తో ధృవీకరించబడింది. డిఎక్స్ఓమార్క్ కెమెరా పనితీరు సూచికలో 164 కెమెరా స్కోర్‌తో, మోటరోలా సిగ్నేచర్ భారతదేశంలో రూ. 100,000 లోపు విభాగంలో నంబర్ 1 కెమెరా ఫోన్‌గా నిలిచింది. ఈ సిస్టమ్‌కు కేంద్రంగా 50ఎంపి సోనీ ఎల్ వైటిఐఏ828 ప్రధాన కెమెరా ఉంది. ఇది ఇప్పటివరకు ఉన్న అతిపెద్ద 50ఎంపి సెన్సార్. ఇది 8కె, 60ఎఫ్‌పిఎస్ వరకు 4కె రిజల్యూషన్‌లో డాల్బీ విజన్ వీడియో రికార్డింగ్, క్వాడ్ పిక్సెల్ టెక్నాలజీ, అధునాతన నాయిస్ రిడక్షన్, ఏ లైటింగ్ పరిస్థితులలోనైనా అత్యంత స్థిరమైన ఫలితాల కోసం 3.5° ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో సినిమాటిక్ ఇమేజింగ్‌ను అందిస్తుంది. దీనికి తోడుగా 3 ఎక్స్ ఆప్టికల్ జూమ్, ఓఐఎస్, 100ఎక్స్ వరకు సూపర్ జూమ్ ప్రోతో కూడిన 50ఎంపి సోనీ ఎల్ వైటిఐఏ600 పెరిస్కోప్ కెమెరా, 122° ఫీల్డ్ ఆఫ్ వ్యూ, క్లోజ్-ఫోకస్ మ్యాక్రో సామర్థ్యంతో కూడిన 50ఎంపి అల్ట్రా-వైడ్ + మ్యాక్రో విజన్ కెమెరా, 60ఎఫ్‌పిఎస్ వద్ద 4కె వీడియోకు మద్దతు ఇచ్చే 50ఎంపి సోనీ ఎల్ వైటిఐఏ 500 ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. ఈ మొత్తం కెమెరా సిస్టమ్ పాంటోన్™ వ్యాలిడేటెడ్ కలర్, స్కిన్‌టోన్™ కాలిబ్రేషన్, కచ్చితమైన ఎక్స్‌పోజర్, వైట్ బ్యాలెన్స్, వాస్తవిక రంగుల పునరుత్పత్తి కోసం మల్టీస్పెక్ట్రల్ 3-ఇన్-1 లైట్ సెన్సార్‌తో మరింత మెరుగుపరచబడింది. ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీని సులభం చేయడానికి రూపొందించిన మోటో ఏఐ, గూగుల్ ఏఐ లక్షణాల అధునాతన సూట్ ఇమేజింగ్ అనుభవాన్ని శక్తివంతం చేస్తుంది. ఏఐ సిగ్నేచర్ స్టైల్ దృశ్యం ఆధారంగా రంగు, కాంట్రాస్ట్, టోన్‌ను తెలివిగా మారుస్తుంది. ఏఐ యాక్షన్ షాట్ మెరుగైన షట్టర్ వేగం, స్పష్టతతో హై-మోషన్ క్షణాలను క్లిక్ చేస్తుంది. ప్రతి ముఖం షార్ప్‌గా ఉండేలా ఏఐ గ్రూప్ షాట్ బహుళ ఫ్రేమ్‌లను విలీనం చేస్తుంది. మూసిన కళ్ళను తొలగిస్తుంది. ఏఐ ఆటో స్మైల్ క్యాప్చర్ స్వయంచా లకంగా పరిపూర్ణ క్షణాన్ని సంగ్రహిస్తుంది. ఏఐ ఫోటో ఎన్‌హాన్స్ మెంట్ ఇంజిన్, ఏఐ అడాప్టివ్ స్టెబిలైజేషన్, ఏఐ కలర్ ఆప్టిమైజేషన్ వివరాలు, డైనమిక్ పరిధి, సహజ స్కిన్ టోన్‌లను మెరుగుపరచడానికి నిజ సమయంలో పనిచేస్తాయి. ఏఐ మ్యాజిక్ ఎడిటర్, ఏఐ మ్యాజిక్ ఎరేజర్, ఏఐ ఫోటో అన్‌బ్లర్, ఫోటో టు వీడియో, సినిమాటిక్ ఫోటోస్ వంటి గూగుల్ ఫోటోల ఏఐ సాధనాలు క్యాప్చర్ తర్వాత శక్తివంతమైన ఎడిటింగ్, ఆర్గనైజేషన్, స్టోరీ టెల్లింగ్‌కు వీలు కల్పిస్తాయి.

# భారత దేశ ప్రజాస్వామ్యానికి మార్గదర్శి, దేశ ప్రగతికి పునాది రాజ్యాంగమే

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచంలోనే ప్రజాస్వామ్యానికి ఉత్తమ ఉదాహరణగా నిలిచిన ఆదర్శ రాజ్యాంగం భారతదేశ రాజ్యాంగమంటూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.. ఒక మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.. భారత రాజ్యాంగం ప్రజలకు సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం, సభా స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలను అందించిన మహోన్నత గ్రంథమని ఎంపీ పేర్కొన్నారు. దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించేందుకు అవసరమైన న్యాయ, చట్ట, పాలనా సూత్రాలను రాజ్యాంగం అందిస్తోందని తెలిపారు. వివిధ భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ప్రాంతాలను తనలో ఇముడ్చుకున్న భారతదేశాన్ని



ఐక్యతతో ముందుకు నడిపించే మార్గదర్శి మన రాజ్యాంగమేనని స్పష్టం చేశారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు రాజ్యాంగ బాటలోనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో పాలకులు రాజ్యాంగ విలువలను విస్మరించి, ప్రాథమిక హక్కులను కాలరాశారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని నాయకులు ఎక్కువ కాలం ప్రజల మద్దతు పొందలేరని తెలిపారు. అందుకే ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో గత ప్రభుత్వాన్ని పీఠం దించి, రాజ్యాంగానికి కట్టుబడి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్న డబుల్ ఇంజన్ సర్కార్ దేశ, రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు..

# ఉప్పులూరు ఘటన బాధ్యులను అరెస్టు చేయాలి



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** ఉప్పులూరు ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని పామర్రు నియోజవర్గం మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరు నుంచి 11 మందిని కూలీ పనుల కోసం తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా దొంగతనం ముద్ర వేసి, బందీలుగా చేసి కొట్టటంతో పాటు చొక్కాలు విప్పి, తాళ్లతో కట్టేసిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో బాధితులైన వల్లూరు సురేష్, మధులను కైలే అనిల్ కుమార్ పరామర్శించి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉప్పులూరు ఘటనను ప్రభుత్వం, హైకోర్టు సుమోటోగా తీసుకుని కేసులు నమోదు చేయాలని కోరారు. బిసి, ఎస్సి, మైనారిటీ కుటుంబాలకు చెందిన వ్యక్తులను కూలి పనుల కోసం తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా మోసం చేయటంతోపాటు దొంగతనం ముద్ర వేసి బందీలుగా చేసి దాడి చేయటం దుర్మార్గమన్నారు. ఉప్పులూరు ఘటన ఆటవికమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కోడిపందేలు, జూదాలు వద్దని హైకోర్టు చెబుతున్నా అధికార పార్టీ నేతలే వాటిని నిర్వహించటం దారుణమని పామర్రు నియోజవర్గం మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఎస్.సి రిజర్వుడు నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకుండా పోయిందని, అటువంటిది రాష్ట్రవ్యాప్తంగా పేదల పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో స్పష్టమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు, బిసిలు, బలహీన వర్గాల పై దాడులు అధికంగా జరుగుతున్నాయని, అదేమని ప్రశ్నించిన గొంతులను పోలీసుల సహాయంతో నొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే తమ పార్టీ నాయకులను తీసుకువచ్చి పోరాడుతామని హెచ్చరించారు నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తమ పార్టీ తరపున ఎస్సీల సంరక్షణ కోసం ఎంతవరకైనా వెళ్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులైన దళిత కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మాంసపు దుకాణాలకు సెలవు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఉత్తర్వుల మేరకు 26-01-2026 తేదిన (సోమ వారం) నగరంలో ఉన్న కబేళాకు సెలవు అని చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు ప్రకటించారు. ఆదివారం రాత్రి నుండి కబేళాలో ఎటువంటి జంతువులను వధించుటకు అనుమతి లేదని, నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నియు కూడా తెరుచుటకు అనుమతి లేదని, ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించిన యెడల, లేదా షాపులను తెరిచియుండి మటన్, చికెన్, చేపలను అమ్మినా యెడల చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోనబడునన్నారు. కావున మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్నిషాపులు మూసి వేయవలెనని ఆదేశించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లేదు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం గణతంత్ర దినోత్సవము అయినందున, కార్పొరేషన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగును కావున ఈ సోమవారం కార్పొరేషన్ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడం లేదని విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ సోమవారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం రద్దు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, జిల్లాలో నిర్వహించే గణతంత్ర వేడుకలలో పాల్గొనవలసి ఉన్నదని, ప్రభుత్వ సెలవు కారణంగా ఈనెల 26న సోమ వారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టరేట్ డా. జి. లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లా స్థాయి తో పాటు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నేడు పోలీస్ కమీషనరేట్‌లో పి.జి.ఆర్.ఎస్. రద్దు

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బంది జిల్లాలో గణతంత్ర వేడుకలలో పాల్గొనవలసి ఉన్న నేపథ్యంలో ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో ది. 26.01.2026 తేదిన నిర్వహించ వల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి. జి. ఆర్. ఎస్.) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఐ.పి.ఎస్., ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు, అర్జీ దారులు ఈ విషయాన్ని గమనించాలని పోలీస్ కమిషనర్ ప్రకటనలో కోరారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు మండలానికి చెందిన కొందరు అనారోగ్యంతో బాధపడి చికిత్స చేయించుకుని ఆ ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, గొల్లపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సూచనలతో రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుతో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వర్రావు, లంక నాగేశ్వరరావు (నాని) అందజేశారు. వెలగలేరు గ్రామానికి చెందిన చనుమోలు సుకన్య కి రూ.37,000ల, నంబూరి వాసంతికి రూ.30,460ల, చెర్వు మాధవరం గ్రామానికి చెందిన ముదునూరు నాగ చైతన్యకి రూ.32,900ల, తెల్లదేవరపాడు గ్రామానికి చెందిన వేపూరి సుధాకర్‌కి రూ.27,166ల, గుర్రాజుపాలెం గ్రామానికి చెందిన సోమరాజు వెంకట్రావు కి రూ.24,714ల, వెల్లటూరు గ్రామానికి చెందిన సాదం వెంకటేశ్వర్లు కి రూ.42,292ల సాయం చెక్కుల రూపంలో మంజూరు చేయబడిందిముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో పాటు తక్షణ హాస్పిటల్ చికిత్స కొరకు జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన కనికెళ్ళ ప్రగతి కి రూ.5,00,00ల, మోదుగు బాబురావు కి రూ. 2,01,460ల ఎల్వోసీ రూపంలో మంజూరు కాగా వాటిని కుడా బొమ్మసాని సుబ్బారావు తో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అందజేశారు, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నగరంలో తొలిసారి జిల్లాస్థాయి గణతంత్ర వేడుకలకు ముస్తాబైన ఐ.జి.ఎం. స్టేడియం





**రాష్ట్రస్థాయి వేడుకలు అమరావతిలో ఘనంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా తొలి గణతంత్ర వేడుకలు**

**ఐ.జి.ఎం. స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి గణతంత్ర దినోత్సవం స్వాతంత్ర దినోత్సవము రాష్ట్ర స్థాయి వేడుకలను రాష్ట్ర ప్రధాన కేంద్రంలోను జిల్లా స్థాయి వేడుకలను జిల్లా ప్రధాన స్థానంలో నిర్వహించేవారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వేడుకలను హైదారాబాద్లోను జిల్లా స్థాయి వేడుకలను కృష్ణాజిల్లా ప్రధాన కేంద్రమైన మచిలీపట్నంలో నిర్వహించేవారు. రాష్ట్ర స్థాయి వేడుకలను ఇప్పటివరకు విజయవాడ నగరంలో నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయి వేడుకలను నిర్వహించే అవకాశం రాలేదు. ఇటీవల కాలంలో రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మాణ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో అమరాపతి పేరును జాతీయస్థాయిలో బ్రాండింగ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా గణతంత్ర దినోత్సవ అమరావతిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రస్థాయి రిపబ్లిక్ డే ఉత్సవాలు అమరావతిలో ఈనెల 26న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర యంత్రాంగం సమాయత్తమైంది. తొలిసారిగా జిల్లాస్థాయి గణతంత్ర దినోత్సవ ఉత్సవాలు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కేంద్రమైన విజయవాడలో జరుగుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తోంది. ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం నిర్వహించనున్న గణతంత్ర వేడుకలలో జిల్లా అభివృద్ధిని సూచించే విధంగా 18 శకటాలను వేడుకలలో ప్రదర్శించేందుకు సిద్ధం చేశారు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ ముఖ్య అతిథిగా తొలిసారిగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రజలు పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా చరిత్రలో ఒక గొప్ప కార్యక్రమంగా నిలిచిపోయేలా నిర్వహించేలా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారుల సమన్వయంతో స్టేడియంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఆర్డీవో కావూరి చైతన్య ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నారు. ఉదయం 8.30ల నుంచి ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరే షన్ స్టేడియంలో గణతంత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉ.8.66లకు సగర పోలీస్ కమీషసర్ ఎస్.వి. రాజశేఖర్బాబు ప్రాంగణానికి చేరుకుంటారు. ఉ 9 గంటలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రాంగణానికి చేరుకుని జాతీయ పతాకాన్ని అవిష్కరిస్తారు. అనంతరం ఉ.9.30ల వరకు వివిధ కంటింజెంట్ నుండి పోలీసుల గౌరవ వందనాలను స్వీకరిస్తారు. ఉ.10.00గంటలకు జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవ సందేశం అందిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వివిధ శాఖలలో ఉత్తమ సేవలు అందిస్తున్న జిల్లా స్థాయి అధికారులు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేస్తారు.

## డిఆర్ఓ నుండి ప్రశంసాపత్రం అందుకున్న గౌస్



**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్య పరిరక్షణ కు ఓటు హక్కు ప్రతి వ్యక్తి కలిగి ఉండేందుకు కృషి చేసిన రెవిన్యూ ఎన్నికల సిబ్బంది సేవలు మరుపు రానివని కొనియాడుతూ కృష్ణాజిల్లా రెవిన్యూ అధికారి కె.చంద్రశేఖర్ ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. పామర్రు రెవిన్యూ కార్యాలయంలో ఎన్నికల విభాగ కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ గౌస్ జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ నుండి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పామర్రు తహసిల్దార్ గూడపాటి రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ గాలి అనయ్య, పిడిఎస్ డిప్యూటీ తహసిల్దార్ బి.రజినికాంత్, ఆర్.ఐ అల్లూరి రాము, కార్యాలయ సిబ్బంది గౌస్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గణతంత్ర దినోత్సవం సందర్భంగా పూర్తి ట్రయిల్ రన్




**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ది.26.01.2026 తేదిన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగబోవు గణతంత్ర దినోత్సవ వేడుకల పురస్కరించుకొని ఆదివారం పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఇతర శాఖల అధికారులతో కలిసి స్టేడియంలో జరుగబోవు గణతంత్ర దినోత్సవ వేడుకల పూర్తి ట్రయిల్ రన్ ను పర్యవేక్షించడం జరిగింది. స్టేడియంలో కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లపై, భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని తగిన భద్రత చర్యలు చేపట్టాలని ఉన్నత అధికారులుకు ఆదేశాలు జారి చేసారు. అనంతరం మొత్తం పూర్తి ట్రయిల్ రన్ పర్యవేక్షించి అధికారులకు తగు సూచనలును జారీచేశారు. అదేవిధంగా 27 తేదీన డ్రగ్స్ పై దండయాత్ర అనే నినాదంతో ప్రారంభించబోయే అవగాహన సైకిల్ యాత్ర (ర్యాలీ) బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్య క్రమంలో డి.సి.పి.లు షిరిన్ బేగం, కె.జి.వి.సరిత, ఏ.డి.సి.పి.లు, ఏ.సి.పి.లు, పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతు రిహార్సల్స్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆదివారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, ఏ.ఆర్ పోలీస్ పేరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్ ను ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులతో కలిసి వీక్షించారు. పెరేడ్ కమాండర్ గా అడ్మిన్ ఆర్.ఐ రాఘువయ్య వ్యవహరించారు. ముందుగా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకం ఎగుర వేశారు. తరువాత పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసు బలగాల పరేడ్ ను స్వయంగా పరిశీలించారు. ఈ సంధర్బంగా ఎస్పీ మాట్లాడుతూ సివిల్, ఏఆర్, హోంగార్డ్సు, విద్యార్థుల ప్లటూన్స్ అందరూ చాలా చక్కటి టర్నవుట్ తో పరేడ్ రిహార్సల్స్ బాగా చేశారని పెరెడ్ పై సంతృప్తి వ్యక్తపరిచారు, పెరెడ్ లో పాల్గొంటున్న సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలనతో రిహాసల్స్ లో పాల్గొనాలని, ఈ వేడుకలు గర్వకారణంగా నిలిచేలా ప్రతి అంశాన్ని అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఇదే స్పూర్తితో రేపు కూడా రెట్టింపు ఉత్సాహంతో పెరేడ్ చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్లతో భద్రతా పరంగా ఎటువంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బందరు డిఎస్పి సిహెచ్ రాజా, ఏ ఆర్ డి.ఎస్.పి వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**సర్వాంగ సుందరంగా ముస్తాబైన పోలీసు పెరేడ్ మైదానం**

జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు జరగబోవు వేడుకలకు ముస్తాబవుతున్న మచిలీపట్నం ఆర్మ్డ్ రిజర్వు పోలీసు మైదానం




గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో సివిల్,ఆర్మడు రిజర్వ్,హోంగార్డు,ఎన్ సి సి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కవాతు నిర్వహణలో పాల్గొంటారు– పెరేడ్ కమాండర్ గా ఆర్ ఐ రాఘవయ్య వ్యవహరిస్తారు. పెరేడ్ మైదానంలో ఇప్పటికే అన్ని శాఖల స్టాల్స్, ప్రజలు, విద్యార్థులు స్వతంత్ర దినోత్సవ వేడుకలను తిలకించేందుకు గుడారాలు ఏర్పాటు చేశారు, అదేవిధంగా,ప్రముఖులు, పట్టణ ప్రజలు కూర్చునేందుకు గ్యాలరీలను ఏర్పాటు చేశారు.




# పరిమళించిన ఆ నాటి బాల్యం

**1984 బ్యాచ్ రుస్తుంబాద "బడి విద్యార్థుల" అపూర్వ కలయిక**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ జగమంతా పోనీ, యవ్వనమంతా పోనీ, భోగాలు పోనీ, సరాగాలు పోనీ,ఈ నాటి ఈ జీవితమంతా పోనీ.. ఆనాటి బాల్యాన్ని ఒకసారి రాని.! అంటూ స్థానిక రుస్తుంబాద బడి మిత్రుల ఆత్మీయ కలయిక, గొడుగు పేట,ఎస్ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఆహ్లాదభరితంగా సాగింది. మిత్రులంతా ఆ చిన్ననాటి బాల్య స్మృతులను తలుచుకుంటూ పరవశించిపోయారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించు కుంటూ, ఆలింగనాలతో ఆనందానుభూతులను పంచుకున్నారు. వివిధ హోదాలలో స్థిరపడిన దాదాపు 80 మందికి పైగా కొలువుదీరిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆద్యంతం అలరించింది. కొందరు డాక్టర్లు, మరికొందరు లెక్చరర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు,బిల్డర్లు,వ్యాపారస్తులు, ఉపాధ్యాయులు ఇలా రకరకాల వృత్తులలో రంగాలలో స్థిరపడిన ఆనాటి పూర్వ విద్యార్థులు, ఎస్ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆనాటి స్మృతులను తలుచుకుంటూ చిన్నపిల్లలైపోయారు.ఆ నాటి బాల బాలికలు ఒకరినొకరు "ఒరేయ్" "ఏరా" "ఏమే" అంటూ ఆత్మీ యంగా పలకరించుకొని పరవశించిపోయారు. ఎవరె వరు ఎక్కడ ఉన్నారో? అని చర్చించుకున్నారు. జొన్నల గడ్డ విజయ్ కుమార్, ఉదయగిరి సురేష్, డాక్టర్ బండి రామాంజనేయులు, మడమల దుర్గాప్రసాద్, కారుమూరి సురేష్, వడ్లమూడి సూరి తదితరుల చొరవతో ప్రోద్బ లంతో చిన్ననాటి మిత్రులందరూ ఒకే వేదికపై సమా వేశమయ్యేలా ఏర్పాట్లు చేయడం,అందరూ ఆనందంగా గడిపేలా ఏర్పాట్లుచేయడం అభినందించదగ్గ విషయ మని, ప్రముఖ రియాల్టర్ మెట్రో స్పేస్ అధినేత అంబటి రమేష్ బాబు అన్నారు.

కార్యక్రమ నిర్వాహకులు జొన్నలగడ్డ విజయ్ కుమార్, ఉదయగిరి సురేష్, తిరుమల శెట్టి శాంతారావు ఆనాటి బాల్య మధుర స్మృతులను మరొక్కసారి తలుచుకున్నారు. సమకాలిన సమస్యలతో నిత్యం సతమతమయ్యే వారికి, అధిక ఒత్తిడితో బాధపడుతున్న వారికి, ఒత్తిడిని చిత్తు చేయడానికి స్నేహం అనే మహా వృక్షం చెంతన చేరితే మనందరి సేద తీరుతుందన్నారు. స్నేహం వల్ల ఒత్తిడి చిత్తడి అవుతుందని, షుగర్ బిపి లాంటి వ్యాధుల తీవ్రత తగ్గుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం రుస్తుంబాద ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ప్రధానో పాధ్యాయులు తోట రఘుకాంత్ ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె ఎస్ మూర్తి, ఆచంట కృష్ణమోహన్, మన్నెం శ్రీనివాసరావు, రామ లక్ష్మీ,కళ్యాణి, సునీత, మల్లాది రామలక్ష్మి తదితర బాల్యమిత్రులు దాదాపు 80 మంది ఒకే చోట చేరి అల్లరి చేస్తూ ఆహ్లాద భరితంగా ఉత్సాహభరితంగా రోజంతా గడిపారు.

## బల్లిపర్రులో అవగాహన సదస్సు



**పామర్రు మేజర్ న్యూస్ :** విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై పామర్రు మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామం వద్ద పోలీసులు వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శుభాకర్, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, పిఎస్ఐలతో కలిసి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, సీట్‌బెల్ట్ ధరించడం, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించడం, అలాగే మహిళలపై జరుగుతున్న నేరాల నివారణపై ప్రజలకు సిఐ శుభాకర్ అవగాహన కల్పించారు. రహదారి భద్రతతో పాటు మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

## ఎర్రబ్బాయి చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కందుల వెంకటేశ్వరరావు (ఎర్రబ్బాయి) ఇటీవల మృతి చెందగా ఆదివారం జరిగిన పెదకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా ఎర్రబ్బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిపై నుండి దూసుకు వెళ్లిన లారీ.. అక్కడికక్కడే మృతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం జి. కొండూరు మండలంలోని చెరువు మాధవరం గ్రామంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలో కేజీవీబి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు నిర్మాణానికి ఉపయోగించే మెటల్ అన్లోడ్ చేసే క్రమంలో ఒక్కసారి లారీ వెనకకు వేగంగా దూసుకొచ్చింది ఈ క్రమంలో అటుగా వస్తున్న చెరువు మాధవరం గ్రామానికి చెందిన చెన్నం శెట్టి సాంబశివరావు (60)పై లారీ ఎక్కి దిగడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. ప్రమాదానికి కారణం లారీ డ్రైవర్ నిర్లక్ష్యమేనని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్ను జి. కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు

**మానవత సేవా సంస్థ అధ్యక్షులు ఎన్టీఆర్**



**పామర్రు మేజర్ న్యూస్ :** దాతల సహకారంతో మానవత సేవ సంస్థ పామర్రులో నూతన సంవత్సరంలో మరిన్ని సేవకార్యక్రమాలు చేపట్టనున్నట్లు పామర్రు మానవత సంస్థ అధ్యక్షులు ఎన్.త్రివిక్రమరావు వెల్లడించారు. ఆదివారం పామర్రు మానవత కార్యాలయం లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ రిపబ్లిక్ డే వేడుకలతో పాటు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు, వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో చైర్మన్ సీతాల ప్రసాద్, రీజియన్ చైర్మన్ పి.ఎం.ఎస్.ప్రసాద్, డైరక్టర్ లు సోమవరపు రామారావు, పామర్తి వెంకట నారాయణ, నీలి సాంబశివరావు, వై.ఎస్.ఎన్.ప్రసాద్, బొంతు సుధాకర్, అల్లాడ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**జి కొండూరు మేజర్ న్యూస్ :** వెలగలేరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను అర్హత గల అభ్యర్థుల నుండి స్వీకరిస్తున్నట్లు సూపర్వైజర్లు డి.జోజి కటాక్షం, ఐ. అన్నమ్మ తెలిపారు. జి కొండూరు,వెలగలేరు సెక్టార్ పరిధిలోని దుగ్గిరాలపాడు బి2 గ్రామంలో బి సి డి అభ్యర్థి అంగన్వాడి కార్యకర్తకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.అలాగే ఈ క్రింది తెలిపిన గ్రామాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు కూడా అర్హత గల మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కోడూరు బి సి డి మహిళా,కే కంద్రిక జనరల్ మహిళ, చిన్న నందిగామ–1 ఎస్సీ గ్రూపు సి మహిళ కు రిజర్వేషన్ కేటాయించమన్నారు. వెలగలేరు –2ఎస్సీ గ్రూపు సి, దుగ్గిరాలపాడు సెంటర్ కు బి సి డి మహిళ. గడ్డమడుగు లోయ గాంధీ క్యాంప్, పినపాక సెంటర్ కు ఎస్సీ సి మహిళ అభ్యర్థికి రిజర్వేషన్ కల్పించినట్లు జోజికటాక్షం, అన్నమ్మలు తెలిపారు. ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకునే మహిళా అభ్యర్థులు అందరూ ఆయా గ్రామాలకు చెందినవారై ఉండాలన్నారు వారంతా పదో తరగతిపాస్‌అయిఉండాల న్నారు. ది 1బి07– 2026 వరకు 21 నుండి 30 సంవత్సరాల వరకు వయస్సు కలిగి ఉండాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, అభ్యర్థులంతా జి కొండూరు తహసిల్దార్ వారు ధ్రువీకరించిన కుల,ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని వారు తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలు లోపు మైలవరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని అంగన్వాడి సూపర్వైజర్లు జోజి కటాక్షం,అన్నమ్మలు తెలిపారు.



## పీహెచ్‌డి పూర్తిచేసిన నరేంద్రకు సత్కారం

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పాములలంక గ్రామానికి చెందిన పాముల నరేంద్ర పీహెచ్ డి పూర్తి చేసిన సందర్భంగా పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు. పాములలంక గ్రామానికి విచ్చేసిన అనిల్ కుమార్ గ్రామంలో నరేంద్ర ఇంటికి వెళ్లి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. జీవితంలో నరేంద్ర మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు జడ్పిటిసి సభ్యులు జొన్నల రామమోహన్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ మం డలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. మండల పరిధిలోని పాములలంక గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుత్తూరు రవి తండ్రి అనారోగ్యకారణంతో ఇటీవల మర ణించగా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగ క్షేమాలు తెలుసు కొని ధైర్యం చెప్పారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం గ్రామాలలో కూడా ఆయన పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులను వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కైలే అనిల్ కుమార్ తో పాటు మండల పరిధిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన పమిడిముక్కల నాయకులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** బెయిల్ పై సబ్ జైలు నుంచి విడుదల అయిన మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగి రమేష్‌ను ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు కలిశారు. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పమిడిముక్కల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కృష్ణా జిల్లా వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, పమిడిముక్కల మండల పార్టీ కార్యవర్గ సభ్యులు బొల్లా యోగేష్ గౌడ్, కృష్ణాజిల్లా వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపిటిసి సభ్యుడు గురిందపల్లి వంశీ జోగి రమేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై పామర్రులో భారీ ర్యాలీ




**పామర్రు మేజర్ న్యూస్ :** ఓటు యొక్క విలువను ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందని పామర్రు తహసిల్దార్ గూడపాటి రవికాంత్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన పామరులోని పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ రెవిన్యూ అధికారులు, ఎన్నికల విభాగ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తహసిల్దార్ గూడపాటి రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ గాలి అనసయ్య, పి.డి.ఎస్. డిప్యూటీ తహసిల్దార్ రజిని కాంత్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అల్లూరి రాము, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నగర అధ్యాపకులు లంకిశెట్టికి బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ గురురత్న అవార్డు




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక లేడీ యాంప్థుల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్ లంకిశెట్టి కుసుమ హరినాథ్ బాబుకు ఆదివారం మద్రాస్ లో "బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్" అవార్డును డాక్టర్ జయ రామచంద్ర మోరి టైం ఫౌండేషన్ ఎ. ఎం. ఈ. టి. యూనివర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డు అందించారు. హరనాద్ బాబు గత 30 సంవత్సరాలుగా స్థానిక ప్రభుత్వ లేడీ యాంప్థుల్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తూ కొన్ని వేల విద్యార్థులకు యూనిఫార్ములు, ఫీజులు చెల్లింపు తో బాటు ఎన్ఎస్ఎస్ క్యాంపు ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందారు.తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉత్తమ సేవకుల గుర్తింపులో ఆంధ్రప్రదేశ్ నుండి ఆరుగురిని అవార్డుకు గుర్తించారు. అందులో లంకిశెట్టి కుసుమ హరనాథ్ బాబు ఒకరు. ఆదివారం మద్రాస్ లో జరిగిన అవార్డు ఫంక్షన్ లో యూనివర్సిటీ ఛాన్సెలార్ జయ రామచంద్రన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ రాజేష్ రామచంద్రన్ ఆధ్వర్యంలో లంకిశెట్టి కి గురురత్న టీచర్ అవార్డును బహుకరించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొంది, నేడు జాతీయ స్థాయిలో అవార్డు పొందడం పట్ల హరినాథ్ బాబును కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు కొల్లు శ్రీనివాసరావు సభ్యులు లంకిశెట్టి బాలాజీ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వర రావు, అనురాధ, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## శ్రీ శివ నాగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ



**గన్నవరం, జనవరి 25, మేజర్ న్యూస్ :** ఆదివారం రథసప్తమి సందర్భంగా మదర్ తెరిసా కాలనీలో గల శ్రీ శివ నాగేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన హేమంత్ కుమార్, ఆయన ధర్మపత్ని దివ్యశ్రీ దంపతులచే స్వామివారికి అభిషేకము, పుష్పాలంకరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం హేమంత్ కుమార్, దివ్యశ్రీ దంపతులచే భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయగా, భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల్లో విశేష ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగించింది.

## సీనియర్ సిటిజనులకు సన్మానం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్లకు సన్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో లంక నాగేశ్వరావు సుఖవాసి శ్రీహరి ప్రత్తిపాటి వెంకట్రావు వీఆర్వో రమేష్ సచివాలయ సిబ్బంది శిరీష తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్లో ఘనంగా జాతీయ వాటర్ దినోత్సవం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం జి కొండూరులో ఓటర్ల దినోత్సవం సందర్భంగా జి.కొండూరు గ్రామంలోని ఎస్ ఎస్ ఆర్ జడ్పీ హైస్కూల్లో రెవెన్యూ డిపార్మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జి కొండూరు తెలుగుదేశం పార్టీ నాయకులుప్రతి ఎన్నికల్లో ఎవరికి ప్రభావితం కాకుండా, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా ఓటు హక్కును యువత, అందరూ ఎలా వినియోగించుకోవాలో అని ప్రతిజ్ఞ చేయించారుఅనంతరం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి, ప్రశంస పత్రాలు,, బహుమతులు అందజేశారుఈ కార్యక్రమంలోమైలవరం మాజీ ఏఎంసీ చైర్మన్, ఉయ్యూరు వెంకట నరసింహారావు, జి కొండూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పజ్జూరు విజయ్ కుమార్, రైతు ప్రధాన కార్యదర్శి, అంకెం సురేష్, జి కొండూరు మాజీ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి), జి. కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్స్ డే

**విస్సన్నపేట మేజర్ న్యూస్ :** విస్సన్నపేట టీడీపీ కార్యాలయంలో ఘనంగా జాతీయ ఓటర్స్ డే సందర్భంగా విస్సన్నపేట టీడీపీ కార్యాలయంలో సీనియర్ ఓటర్లు నాగేశ్వరావు నారాయణరావులను మండల ప్రధాన కార్యదర్శి ఆకుల సత్యనారాయణ పట్టణ అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు, నాయకులు ఘనంగా సన్మానించారు.

## వైసీపీ సర్పంచ్ వెంకటేశ్వరావుకు ఘన నివాళి

**విస్సన్నపేట మేజర్ న్యూస్ :** విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామ వైసీపీ సర్పంచ్ పొద్దుటూరు వెంకటేశ్వరావు పార్థివదేహానికి వైసీపీ శ్రేణులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోకేశ్వర్ రెడ్డి ఎంపీపీ గద్దల మల్లయ్య జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి శిరసాని ప్రకాష్ మండల పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు తదితరులు నివాళులు అర్పించారు.

## టీడీపీ నేతకు అరుదైన గౌరవం

**ఏ కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి ఉత్తమ మార్గదర్శి అవార్డుకు ఎంపికైనట్లు కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక సేవలో ఆయన చేసిన సేవలను గుర్తించి మార్గదర్శకత్వానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం జరగనున్న కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు. అవార్డు అందుకుంటున్న గడ్డి కృష్ణారెడ్డికు రామచంద్రాపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలసిన వైసిపి నేతలు



**ఘంటసాల,మేజర్ న్యూస్ :** ఘంటసాల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన చందనను వైసీపీ నేతలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, వైస్ ఎంపీపీలు కుంపటి నాగేంద్ర బాబు, మాదెం నాగరాజు, వైస్సార్ సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు వేమూరి ప్రవీణ్, పార్టీ నేతలు కుంపటి శరత్ బాబు, తాతినేని వెంకట కృష్ణారావు, పెనుమత్స శేఖర్ ఉన్నారు.

## హెచ్పిసిఎల్ బిపిసిఎల్ పరిసర ప్రాంతాల్లో ఆయిల్ దొంగల హల్ చల్



**సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అదురు బెదురు లేకుండా ఆయిల్ దొంగతనాలు**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పినపాక పంచాయతీ పరిధిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీల వద్ద నిత్యం ఆయిల్ దొంగలు హల్ చల్ చేస్తున్నారు చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని వారు ఆవేదన చెందుతున్నారు ఆగి ఉన్న ట్యాంకర్లో సుమారు 200 మీటర్లు డీజిల్ మాయం చేశారన్నారు ఆయిల్ దొంగలు రాత్రి సమయాల్లో జీబు ఆటోలలో తిరుగుతున్నారన్నారు దీనికంతటికి కారణము సరైన పార్కింగ్ లేక పోవడమే కారణమని పలువురు యూనియన్ నాయకులు గరికపాటి లాజరు తన సహచర ట్యాంకర్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రక్కనే పార్కింగ్ ఉండటంతో ఆయిల్ దొంగతనాలు జరుగుతున్నాయని కార్మికులు ఆవేదన చెందుతున్నారు దొంగలించబడ్డ ఆయిల్ ఖర్చు డ్రైవర్ల పెట్టుకోవాలని యజమానులు కరాకండిగా చెప్పడంతో డ్రైవర్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా పోలీసు వారు తగు చర్యలు తీసుకొని ట్యాంకర్ డ్రైవర్లకు కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ మైలపల్లి అప్పారావుకి అభినందనలు



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** మండలంలోని కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి కి చెందిన పారా బాడ్మింటన్ ప్లేయర్ మైలపల్లి అప్పారావు (ప్రేమ సాగర్) ని గ్రామస్తులు, సంఘ సభ్యులు అభినందించారు. 2026 జనవరి 13 నుండి 18 వరకు ఈజిప్ట్ లో జరిగిన అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ప్రయత్నంలోనే క్వార్టర్ ఫైనల్ కి వెళ్లడం అభినందనీయమని గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మొగులూరు ఎలీషా అన్నారు అలాగే మార్చి 16 నుండి 22 వరకు స్పెయిన్ వేదికగా జరిగే ఇంటర్నేషనల్ టోర్నమెంట్ కి అలాగే మే నెలలో దుబాయ్ లో జరిగే ఇంటర్నేషనల్ టోర్నమెంట్ కి సెలెక్ట్ అవడం జరిగింది అని తెలుసుకొని అభినందించారు. అంతేకాకుండా లక్షల రూపాయల తో కూడుకున్న ఈ పోటీ లకు ఆర్థిక సహాయం చేసే దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు.పారా క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సాహించాలని,అథ్లెట్లకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిశించాలని అన్నారు.మైలపల్లి అప్పారావు (ప్రేమ సాగర్) ఇంకా అంతర్జాతీయ స్థాయిలో రాణించి భారత దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మొగులూరు ఎలీషా, సుమలత, అబ్రహం, మాణిక్యరావు, హరీష్, స్పోర్ట్స్ మెంబర్స్, సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోడూరులో హిందూ ఆధ్యాత్మిక శోభయాత్ర

**కోడూరు మేజర్ న్యూస్ :** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీ పంచజన్యం గీతా పారాయణం. హిందూ ఆధ్యాత్మిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో హిందూ ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. ఆదివారం కోడూరు టీడీపీ కళ్యా ణమండపం వద్ద గీత పారాయణం. హనుమాన్ చాలీసా పారాయణం పోటీలు నిర్వహించారు అనంతరం కోడూరు గ్రామ పురవీధులతో కాషాయ వస్త్రాలు ధరించి జెండాను పట్టుకొని భక్తి గేయాలకు నృత్యం చేస్తూ శోభయాత్ర చేశారు.

## చిన్నారి ఆపరేషన్ కోసం రావెళ్ల ఉదయ్ ఆర్థిక సహాయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం వెలివోలు గ్రామానికి చెందిన జంపాని సాంబశివరావు కుమార్తె నాలుగేళ్ల అనుదీప్తికి గుండె ఆపరేషన్ చేయాల్సి ఉండగా, నిరుపేద కావటంతో రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ రూ.15వేల ఆర్థికసాయం అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.రెండు లక్షలు మంజూరు కాగా, ఆపరేషన్ కు మరో రూ.రెండు లక్షలు అవసరమైంది. దీంతో విషయం తెలుసుకున్న ఉదయ్ కుమార్ తనవంతు సాయంగా రూ. 15వేలు అందచేశారు. దాతలు చిన్నారి ఆపరేషన్ కు సాయం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మేకావారిపాలెం సొసైటీ ఛైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, పరుచూరి సురేష్ తదితరులు ఉన్నారు.

## కామ్రేడ్ డాక్టర్ ఎం వి మోహన్ రావు 53వ వర్ధంతి



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీలో కామ్రేడ్ నందూరి ప్రసాదరావు కార్మిక భవన్లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు టౌన్ కమిటీ సభ్యులు ఎస్కె.బాషా అధ్యక్షతన జరిగిన సభలో కొండపల్లి సిపిఎం పట్టణ కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ డాక్టర్ ఎమ్ వి సమితి ఉపాధ్యక్షులుగా పేదల డాక్టర్ గా, ప్రజా రాజకీయ నాయకుడిగా విలువలతో కూడిన రాజకీయాలను నిస్వార్థంగా తను వైద్య వృత్తి చేసుకుంటూ ప్రజల కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తి గా కొండపల్లికి డ్రింకింగ్ వాటర్, వీటి పిఎస్ రావడానికి కొండపల్లి ఇండస్ట్రియల్ ఏరియా పునాది పడటానికి గ్రామ సర్పంచ్ గా తమ వంతు కృషి చేశారని ఎలాంటి అవినీతి లేకుండా నిజాయితీగా నిస్వార్థంగా సిపిఎం పార్టీ తరపున ఆనాడు పనిచేసిన ఘనత డాక్టర్ ఎంవి మోహన్రావుదని కొనియాడారు. నేటి రాజకీయాలు అవినీతిమయం, కక్షపూరితంగా కొనసాగుతున్నాయని ప్రజల కోసం సమాజ అభివృద్ధి కోసం పాలక పార్టీలు పనిచేయటంలో విఫలం కావడం వల్లే ప్రజా సమస్యలు వర్ధాతీతంగా ఉన్నాయని వాటి పరిష్కారానికి సిపిఎం పోరాటమే మార్గమని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ యం వి మోహన్ రావు కుమారుడు డాక్టర్ మామిడి సీతారామారావు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బాడిన వెంకటేశ్వరరావు, వై వెంకటేశ్వరరావు డాక్టర్ మోహన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టౌన్ కమిటీ సభ్యులు ఎస్ కె భాషా, వి మురళీమోహన్, కే బేబీ సరోజినీ, వెంకటేశ్వరరావు, నవీన్, అప్పారావు,కృష్ణ, నాగమణి, నూకరత్నం పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు గ్రామంలోని పరిశుద్ధ మార్కు సిఎస్ఐ దేవాలయంలో ఆదివారం బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి క్రైస్తవ సోదరులు ప్రతిజ్ఞ చేశారు. మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్స్ ఐ.అన్నమ్మ,డి.జోజి కటాక్షం లు స్థానిక చర్చి లో జరిగే ప్రార్థనలకు హాజరై తదనంతరం క్రైస్తవ సోదరులు చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను గురించి వారు వివరించారు. చిన్న వయసులోనే పిల్లలకు వివాహాలు చేస్తే 100,181, 1098 లకు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు నన్నారు. అలాగే మాతా శిశు మరణాలు సంభవిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి ఎం జాన్ కోటేశ్వరావు, అంగన్వాడి కార్యకర్తలు హేన, వాణి, జ్యోతి, చందన, వి.నిర్మల, ఈ నాగమణి,బి.జయ కుమారి,సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో చేరిన ఎస్సీ, బీసీ నాయకులు, యువకులు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** గ్రామాల సమగ్ర అభివృద్ధి పవన్ కళ్యాణ్ విధానం అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం సెంటరులో మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేనలో చేరికల కార్యక్రమం జరిగింది. మండలి వెంకట్రామ్ సమక్షంలో ఇందిరమ్మ కాలనీ నుంచి వేముల కిరణ్ తో పాటు ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన 12మంది యువకులు, వైసీపీ నేత కారుమూరి ప్రభుదాస్, గ్రామానికి చెందిన యార్లగడ్డ హనుమంతరావు, సోమిశెట్టి విష్ణుప్రసాద్, బోలెం శేషగిరిరావు, కాకి వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం నాగకుమారి జనసేన పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ జనసేన పార్టీ విధానాలు, గ్రామీణ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ కృషి నచ్చి జనసేన పార్టీలో చేరిన వారిని అభినందించారు. జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, మౌళిక సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన గ్రామీణ ఉపాధి హామీ నిధులతో లక్ష్మీపురం గ్రామంలో పల్లెపండుగ-1 కార్యక్రమం ద్వారా రూ.85లక్షలతో నూతన సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పల్లె పండుగ-2కార్యక్రమంలో రామానగరం నుంచి ఎన్.హెచ్-216 వరకూ రూ.45లక్షలతో నిర్మాణం చేపట్టిన నూతన తారురోడ్డు నిర్మాణం ఫిబ్రవరిలో పూర్తి అవుతుందన్నారు. గ్రామంలో పశు పోషకులు, గొర్రెల పెంపకందారులకు మునుపెన్నడూ లేని స్థాయిలో నిధులు వెచ్చించి గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో కీలకమైన మరో మౌళిక వసతి త్రాగునీటి సరఫరాకు జల జీవన్ మిషన్ పథకానికి గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి ఆ పథకం ద్వారా చేపట్టిన పనులన్నీ గాడిలో పెట్టి పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రధాని నరేంద్రమోడీ సహకారంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పథంలో గ్రామాలను నడిపించేందుకు పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని గుర్తించి జనసేన పార్టీ వైపు ఆకర్షితులై పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ అభినందించారు.

కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, మండల జనసేన పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చోడగం విమల్ కృష్ణ, తోట మురళీకృష్ణ, సర్పంచులు కొల్లూరి కోటేశ్వరరావు, అంకం మారుతీరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, నియోజకవర్గ మాజీ ఐటీ కో-ఆర్డినేటర్, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, పార్టీ ఉపాధ్యక్షులు ఉరిమి మణికాంత్, నీటి సంఘ ఉపాధ్యక్షులు వాసన దుర్గాప్రసాద్, సొసైటీ డైరెక్టర్ సూదాని పూర్ణ, పార్టీ సీనియర్ నాయకులు జీవీ తాతారావు, అడపా రాంబాబు, అనుమకొండ పూర్ణచంద్రరావు (ప్రెస్ పూర్ణ), నల్లమోతు వీరయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు, ఉప సర్పంచ్ దాసరి సురేష్, నాయకులు సోమరౌతు చిన్మయి కృష్ణ, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నెయ్యి తీర్పు పట్ల వైసీపీ హర్షం

### పులిగడ్డ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టిన వైసీపీ నాయకులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్** తిరుమల తిరుపతి దేవస్థానంలో కల్తీ నెయ్యి ద్వారా వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో లడ్డూలు తయారు చేశారని ఆరోపణ చేయడంతో పాటు, జంతు సంబంధిత కొవ్వులను ఉపయోగించారని కూటమి ప్రభుత్వం ఆరోపించిందని, ఆరోపణలో నిజం లేదని సిట్ తేల్చడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆది వారం మండల పరిధిలోని పులిగడ్డ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు దుర్బుద్ధితో లడ్డు కల్తీ వ్యవహారం తెరమీదకి తెచ్చారని పవిత్రమైన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో లడ్డు కల్తీ జరిగిందని ఆరోపణ చేయటం విచారకరమన్నారు. ఆ దేవదేవుడు సాక్షిగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వ ఆరోపణలు నిరా ధారమని తేలిపోవడంతో ఆ వెంకటేశ్వర స్వామి వారిని శిక్షిస్తారని చెప్పారు. ఇప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 44% ఓట్లు ఉండడంతో ఆ ఓట్లను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న విశ్వ ప్రయత్నాల్లో ఇది కూడా ఒక భాగమని, ఆ ఓట్లను కొల్లగొట్టడం వారికి సాధ్యం కాకపోవడంతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకున్నారని విమర్శించారు. జగన్కు వ్యతిరేకంగా హిందువులను తయారు చేసేందుకు కుట్ర పన్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దోచుకోవడం, దాచుకోవడమే పాలిస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులో వెంకటేశ్వర స్వామి ప్రజల ద్వారా తగిన శాస్తి చేస్తారని రమేష్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల. సుమతి దేవి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు సింహాద్రి. వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలుకుర్తి. రమేష్, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండల పార్టీల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పరిసే. మాధవరావు, భోగాది. వెంకట శేషగిరిరావు, గరికపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ. పిచ్చే శ్వరరావు, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలుకుర్తి. పృథ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రథసప్తమి వేడుకలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకనూరు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీ ఉషా పద్మనీ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఆద్యాంతము భక్తులను అలరింప చేసింది. సోమవారం మండల పరిధిలోని గ్రామంలో కొలువై ఉన్న సూర్యనారాయణ స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రివరకు కొనసాగిన వివిధ పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ సిద్ధాంతి పాకలపాటి రామచంద్ర రావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి దీవి ఫణి కృష్ణ వాసుదేవాచార్యులు వేకువ జామునే స్వామి వారకి అభిషేకములు, అర్చనలు చేసి స్వామివారి నిజరూప దర్శనము గావించారు. ఎనిమిది గంటలకు సూర్య నమస్కారాలతో ప్రారంభించిన కార్యక్రమాల అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. వధూవరులుగా అలంకరించిన శ్రీ సూర్యనారాయణ స్వామి, ఉషా పద్మనీ దేవతల దర్శనం భక్తులను ఆకట్టుకుంది. మంగళవాయిద్యాలు, నాదస్వరాల మధ్య తాలంబ్రాల కార్యక్రమం భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. వేలాదిగా పోటెత్తిన భక్తులతో రహదారులు స్తంభించిపోయాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు తుంగల వీర వసంతరావు ఇందిరా దంపతులు భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించగా అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో ట్రాఫిక్ న క్రమబద్ధీకరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా ప్రసాద వితరణ లో దాదాపు పదివేల మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువకులు కార్యక్రమ ఏర్పాట్లలో చురుగ్గా పాల్గొని కల్యాణోత్సవాన్ని విజయవంతం చేశారు.



## బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను నివారించండి

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలను నివారించాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ సలీమున్నీసా పేర్కొన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం కొత్త హాజరవాడలో గల చర్చి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు చర్యలను చేపట్టిందన్నారు. బాల్యంలోనే వివాహం చేయడం వల్ల మహిళలకు ఆరోగ్య సమస్యలు ఎదురు కావడంతో పాటు మానవ వికాసం కుంటుపడుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వివాహ వయసు వచ్చేవరకు వివాహం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా అటువంటి వివాహాలు చేసినట్లయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్త ఆనందకుమారి, ఆశా కార్యకర్త కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రైతు విశ్రాంత భవనం ప్రారంభం

**ఘంటసాల,మేజర్ న్యూస్ :** ఘంటసాలకు చెందిన ఆదర్శరైతు అయినపూడి విజయకుమార్ రూ.4 లక్షలుతో తన తల్లిదండ్రులు అయినపూడి వెంకట్రామయ్య-విశాలాక్షి దంపతులు జ్ఞాపకార్థం బోళ్లపాడు-మామిడితోట రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన రైతు విశ్రాంత భవనంను ఆదివారం హైదరాబాద్ రాంపెక్స్ ఇండస్ట్రీస్ మేనేజరు. ఘట్టమనేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తాగునీటికి ఏర్పాటు చేసిన చేతిపంపును ప్రారంభించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెకంటరామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో దాత విజయకుమార్ మాట్లాడుతూ రైతు విశ్రాంత భవనంను బోళ్లపాడు పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించు కోవాలన్నారు. వెంక ట్రామయ్య,-విశాలాక్షి దంపతుల ఫొటోలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై గొర్రెపాటి ఉదయభాస్కర్, గ్రామప్రముఖులు గొర్రెపాటి వెంకట నరసింహారావు.. వేమూరి వెంకట్రావు, గొర్రెపాటి జగన్మోహనరావు, రాజబాబు, రాంబాబు, శ్రీనివాస్, యోహాను, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఓటు హక్కు పై అందరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు చెప్పారు ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ మీటింగ్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఓటర్లను శాలువాలతో పూలదండలతో సత్కరించారు. కొత్తగా ఓటు హక్కును పొందిన విద్యార్థిని విద్యార్థులకు ఓటు యొక్క విలువలను వివరిస్తూ ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. తొలుత ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవనిగడ్డ పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి పెనుమూడి సాయిబాబు అవనిగడ్డ తాసిల్దార్ ఏ శ్రీనివాసరావు, పలువురు రెవెన్యూ సిబ్బంది సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు.

## పులిగడ్డలో జాతీయ ఓటర్ల దినోత్సవం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఓటు హక్కు రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప వరం అని సర్పంచ్ విజయ్ కుమార్ అన్నారు.ఆదివారం మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ లో 16వ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని సీనియర్ ఓటర్లు చెన్ను నాగమల్లేశ్వరి, మండలి లక్ష్మీ కుమారి లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు ఈ సందర్భంగా పులిగడ్డ వీధులలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు డిజిటల్ అసిస్టెంట్ సుబ్రమణ్యం మహిళా పోలీస్ నవ్య జూనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబశాస్త్రికి పద్మశ్రీ ప్రకటించటం పట్ల హర్షం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అద్వైత-వేదాంత, దర్శనాలు, కావ్యశాస్త్ర, సంస్కృత సాహిత్యంలో సంస్కృత పండితులు ఆచార్య వెంపటి కుటుంబ శాస్త్రికి భారత ప్రభుత్వం అత్యున్నత పద్మశ్రీ పురస్కారం ప్రకటించటం హర్షణీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. మోపిదేవి మండలం మెరకనపల్లి పంచాయతీ టేకుపల్లికి చెందిన కుటుంబశాస్త్రి పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావటం తమకు గర్వకారణం అన్నారు. న్యూఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, వారణాసి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం, గుజరాత్ శ్రీ సోమనాథ్ సంస్కృత విశ్వ విద్యాలయాలకు ఉప కులపతిగా పనిచేశారని తెలిపారు. భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పీఠములో తొలి ఆచార్యులుగా పనిచేశారని తెలిపారు.

# ప్రజాస్వామ్య పటిష్టతకు ఓటు హక్కు వినియోగమే బలమైన పునాది

## ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్








**విజయవాడ, మేజరన్ న్యూస్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ తెలిపారు. స్థానిక తుమ్మల పల్లి కళాక్షేత్రం లో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ హాజరై మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. భారత ఎన్నికల సంఘం 1950, జనవరి 25న స్థాపించబడిన ప్రకారం ఈ రోజున నిర్వహిస్తామన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, ముఖ్యంగా యువ ఓటర్లను ప్రోత్సహించడం, వారి హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ ఏడాది "నా భారత్ – నా ఓటు" థీమ్ తో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు వేయడం కేవలం ఒక హక్కు మాత్రమే కాదు...ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి ఓటు ప్రజాస్వామ్య భారత నిర్మాణానికి బలమైన పునాది వేస్తుందన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, దీని బలం పౌరుల భాగస్వామ్యంలోనే ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేసి, వారికి ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు ఎన్నికల సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకొని, ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ పిలుపునిచ్చారు. చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం అక్టోబర్ 1950 లో స్థాపించబడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి కేవలం జనవరి 1వ తేదీని మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. ఇప్పుడు కొత్త చట్టం ప్రకారం, 18 ఏళ్లు నిండిన వారు సంవత్సరంలో నాలుగు తేదీలలో (జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1) ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్త ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా లేదా సంబంధిత బి.ఎల్.ఓ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫారం-8 ద్వారా తమ చిరునామాను మార్చుకోవచ్చన్నారు. కేవలం ఎపిక్ కార్డ్ ఉండటం వల్ల ఓటు వేసే హక్కు రాదని,. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో సీఈఓ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించడానికి ఎన్నికల సంఘం పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, పోలింగ్ స్టేషన్లు, పాఠశాలలు వద్ద ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఓటు వేయడం అనేది ఆర్టికల్ 19 ప్రకారం లభించే భావ ప్రకటన, వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో 'మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్' (ఎన్నికల నియమావళి)ని ఎటువంటి రాజీ లేకుండా పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. పౌరుల్లో ఎ టువంటి భయం లేదా నిర్బంధం లేకుండా ఓటు వేసేలా కలెక్టర్లు పటిష్టమైన వాతావరణాన్ని కల్పిం చాలన్నారు. ఒక వ్యక్తి సాధార ణంగా ఎక్కడ నివసిస్తుంటే అక్క డ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఒక వ్యక్తి పుట్టిన చోటు, ఉద్యోగం చేసే చోటు వేర్వేరుగా ఉండవచ్చు, కాబట్టి ఓటు ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను ఓటరుకు ఇవ్వాలన్నారు. తొలుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వర్చువల్ గా తన సందేశాన్ని అందిస్తూ.. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ మన దేశంలో గౌరవనీయ ఓటర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భారత ఎన్నికల కమిషనర్ 1950, జనవరి 25న, అంటే గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు స్థాపించబడిందన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీని మన గొప్ప ప్రజాస్వామ్య ఓటర్ల కోసం అంకితం చేస్తూ 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా జరుపుకుంటామన్నారు. 2025 సంవత్సరం ఎన్నికల కమిషన్‌కు గణనీయ మైన విజయాలు, ఆవిష్కరణల సంవత్సరంగా నిలిచిందన్నారు. ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వాన్ని, సమగ్రతను పెంపొందించడం, ఓటింగ్ ప్రక్రియను ప్రతి ఓటరుకు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, ఎన్నికల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, దృఢంగా, నమ్మదగినదిగా మార్చడం వంటి చర్యలు తీసుకున్నామని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలియజేశారు. ఓటరుగా నూతనంగా నమోదు చేసుకున్న 4 ఓటర్లకు ఎపిక్ కార్డులు అందజేసిన అనంతరం ఓటు హక్కు ప్రాముఖ్యతపై మతం, కులం, జాతి లేదా భాషా పరమైన ఎలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం బెస్ట్ ఎలక్షన్ జిల్లా అవార్డు-2025 కు గత ఎన్నికల నిర్వహణలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన వారికి ఉత్తమ అవార్డులు, ఉత్తమ ఎన్నికల నిర్వ హణ, ఎన్ రోల్ మెంట్ పెంచడంలో కృషి చేసిన జిల్లా కలెక్టర్లకు అవార్డులను అందించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎలక్టోరల్ అధికారి డా. జి. లక్ష్మీశ, ఎన్నికల విభాగం అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



### రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎన్నికల అవార్డు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎన్నికల అవార్డు అందుకున్నారు. ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ చేతులమీదుగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తమ జిల్లా కలెక్టర్ అవార్డును స్వీకరించారు. 2002 ఓటర్ల జాబితా ను 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే ప్రత్యేక సవరణ కార్యక్రమం లో అత్యధికంగా మ్యాపింగ్ చేసినందుకు ఉత్తమ జిల్లా కలెక్టర్గా డీకే బాలాజీకి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సమిష్టి కృషితో ఇది సాధ్యమైందని, ఇందుకు కృషిచేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, పూర్వపు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి యువర్ ఫెస్ట్‌లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జనవరి 25 :** ఉషారామ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, తేలప్రోలు వారు ఈ నెల 23, 24 వ తేదీలలో డిప్లొమా విద్యార్థులకు జాతీయస్థాయి యువర్ ఫెస్ట్ - 2026 ను నిర్వహించగా ఈ ఫెస్టులో గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొని ప్రదర్శించిన ప్రతి అంశంలో బహుమతులు సాధించి నిర్వాహకులు, న్యాయనిర్ణేతల మన్ననలను అందుకున్నారు. ఇందులో భాగంగా టెక్నికల్ ఎక్సిబిషన్ లో ఇ.సి.ఇ. విద్యార్థులకు ఆక్సిడెంట్ ప్రివెన్షన్ కార్, కంప్యూటర్, ఆర్టిఫిషల్ విద్యార్థులకు హోమ్ ఆటోమేషన్ మెషిన్, మెకానికల్ విద్యార్థులకు వేస్ట్ రీసైకిల్ మేనేజ్మెంట్ అనే అంశాలలో మొదటి బహుమతి, కంప్యూటర్, ఆర్టిఫిషల్ విద్యార్థులకు వే టు ప్రెడిక్ట్, మెకానికల్ విద్యార్థులకు సోలార్ బ్లుటూత్ ఆపరేటేడ్ గ్రాస్ కట్టర్ అనే అంశాలలో ద్వితీయ బహుమతి లభించింది. టెక్నికల్ క్విజ్ లో మెకానికల్ విద్యార్థులు కె.యువరాజు కు మొదటి, జి ఉదయ్ సాయి కు ద్వితీయ బహుమతి లభించాయి. పేపర్ ప్రెసెంటేషన్ లో ది రైజ్ అఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై కంప్యూటర్, ఆర్టిఫిషల్ విద్యార్థులకు మొదటి, అదేవిధంగా మెకానికల్ విద్యార్థులకు సిక్స్ స్ట్రోక్ ఇంజిన్ అనే అంశంపై మొదటి, మాగ్నెటిక్ సస్పెన్షన్ సిస్టం అనే అంశంపై ద్వితీయ బహుమతులు లభించాయి. పోస్టర్ ప్రెసెంటేషన్ లో కంప్యూటర్, ఆర్టిఫిషల్ విద్యార్థులు డార్క్ వెబ్ అనే అంశంపై మొదటి, సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై ద్వితీయ బహుమతులు, మెకానికల్ విద్యార్థులు మాగ్నెటిక్ సస్పెన్షన్ సిస్టం అనే అంశంపై మొదటి, జంక్ ఫుడ్ అడిక్షన్ అనే అంశంపై ద్వితీయ బహుమతులు సాధించారు. అదేవిధంగా కల్చరల్ ఈవెంట్స్ అయిన క్లాసికల్ డాన్స్ లో పి.దీప్తి, జి.జ్ఞానేంద్ర కు మొదటి బహుమతి, పెయింటింగ్ లో బి.వరుణ్ తేజ్ కు మొదతి బహుమతి, లిటరరీ మేజ్ లో జి.జ్ఞానేంద్ర కు ద్వితీయ బహుమతులు లభించాయని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రిన్సిపాల్ అభినందలు తెలియజేస్తూ ఇటువంటి జాతీయ స్థాయి ఉత్సవాలు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ముఖ్యమైనవని, జాతీయ స్థాయి ఉత్సవాలు విద్యార్థులకు విస్తృత అనుభవాన్ని అందిస్తాయి. స్థానిక స్థాయిని దాటి జాతీయ వేదికపై పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, వేదిక భయం తొలగుతుంది. ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందిస్తాయి. విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని విద్యార్థుల్లో పెంచుతాయి. అంతేకాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, చదువుతోపాటు ఇతర రంగాలలోనూ ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తాయి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికీ శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను, వివిధ బ్రాంచ్ల విభాగాధిపతులను, ఈ.సి.ఈ. విభాగాధిపతి జి.వి.వి. సత్యనారాయణ, కంప్యూటర్ విభాగాధిపతి ఎ.కృష్ణ చైతన్య, ఏ.ఐ.ఎమ్.ఎల్ విభాగాధిపతి ఎన్.హేమంత్, మెకానికల్ విభాగాధిపతి ఎస్.సురేష్ లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ & కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ & కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి. రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ అభినందించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999